కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -273 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 13-10-2026 మంగళవారం పేజీలు : 4

# కాంగ్రెస్‌లో కుంపటి.. టెండర్లలో మంట!



న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ. 3,296 కోట్ల విలువైన రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్లలో భారీ కుంభకోణం జరిగిందని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు ఎదురుకావడం బాధాకరమని, సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖలోనే ఈ దోపిడీ జరుగుతోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓ యూట్యూబ్ చానల్‌తో సోమవారం మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రూ.600 కోట్ల ప్రజల సొమ్ము దోపిడీ:

ఈ ప్రాజెక్టులో మూడు ప్యాకేజీలకు సంబంధించి తమ కంపెనీ ఇతర సంస్థల కంటే రూ. 600 కోట్లు తక్కువ ధరకు టెండర్లు వేసినా మా కంపెనీని పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు.

మిగతాది 2 లో..

- రూ.600 కోట్ల టెండర్లలో భారీ రగడ
- సొంత ప్రభుత్వంపైనే రాజగోపాల్ సమరం
- రేవంత్ శాఖలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు
- తక్కువ ధర టెండర్లకు ఎందుకు తిరస్కరణ
- సీఎంఓ ఫోన్లపై రాజగోపాల్ సంచలన వ్యాఖ్యలు
- టెండర్ల వ్యవహారం రాహుల్ గాంధీ వద్దకు
- న్యాయం కోసం సుప్రీంకోర్టు వరకు పోరాటం
- సింగరేణి పరిస్థితిపై రాజగోపాల్ తీవ్ర ఆందోళన
- ప్రజాధనం దుర్వినియోగంపై పోరాట హెచ్చరిక

# కామన్ పాస్ ధరలపై సర్కార్ పునరాలోచన!


2 లో

న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్ ఛార్జీలను పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను, వాస్తవ పరిస్థితులను సమీక్షిస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం అమల్లోకి తీసుకొచ్చిన కామన్ పాస్ ధరలు రోజువారీ పాస్‌కు రూ.400 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్టీసీ వాటా రూ.100గా ఉంది. అదేవిధంగా నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500 కాగా..

# ఏపీకి మరో వాయుగుండం ముప్పు!


2 లో

న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం మరోసారి మారుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నట్లు అధికారులు తెలిపారు.

# సావంత్ పాలనపై రేవంత్ సెటైర్లు!

- గోవాలో రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు
- సీఎం ప్రమోద్ సావంత్‌పై 'ప్రాపర్టీ సావంత్' సెటైర్
- బీజేపీ పాలనపై గోవా ప్రజల్లో వ్యతిరేకత
- గోవా డ్రగ్స్ కేంద్రంగా మారిందంటూ విమర్శ
- బీజేపీని రావణుడితో.. కాంగ్రెస్‌ను రాముడితో పోలిక
- 2027లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయమని ధీమా


2 లో

న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): గోవా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరుగుతున్న 'గోయ్ రాఖోన్న్ యాత్ర' ముగింపు సందర్భంగా కున్కోలిమ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సంచలన ప్రసంగం చేశారు. ఢిల్లీలో జరుగుతున్న ప్రజా నిరసన కార్యక్రమాల నేపథ్యంలో అగ్రనేత రాహుల్ గాంధీ గోవాకు రాలేకపోయారని, అందుకే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు తాను ఆయన ప్రతినిధిగా ఇక్కడికి వచ్చానని సీఎం తెలిపారు. గోవా ప్రజలు బీజేపీ పాలనతో పూర్తిగా విసిగిపోయారని, ఒకవేళ మూడోసారి కూడా బీజేపీ అధికారంలోకి వస్తే స్థానిక ప్రజలు తమ సొంత గడ్డపైనే పరాయివారైపోయే ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

**గోవా సీఎం కాదు.. 'ప్రాపర్టీ సావంత్'..**

ప్రస్తుత గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు

# ఆలయంలో బాలికపై లైంగికదాడికి యత్నం


2 లో

- మహారాష్ట్రలో ఆలయంలో దారుణ ఘటన
- మైనర్ బాలికపై లైంగికదాడికి యత్నం
- పింప్రి-చించ్వడ్‌లోని నిగ్డీ ప్రాంతంలో ఘటన
- సీసీటీవీలో రికార్డైన నిందితుడి కదలికలు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో
- కేసు నమోదు చేసి దర్యాప్తు.. కఠిన శిక్షకు డిమాండ్

# 11 మంది ఐఏఎస్‌లకు కొత్త బాధ్యతలు!

- ఏపీలో 11 మంది ఐఏఎస్‌లకు కొత్త పోస్టింగ్‌లు
- 9 మందికి నూతన బాధ్యతలు.. ఇద్దరికి అదనపు చార్జ్
- ఏపీ భవన్ ఓఎస్డీగా సౌరభ్ గౌర్
- పర్యాటక శాఖ కార్యదర్శిగా ఆమ్రపాలి కాటా
- గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా మురళీధర్ రెడ్డి
- యువజన సేవల సంచాలకుడిగా నీలకంఠ రెడ్డి
- పౌర సరఫరాల సంస్థ ఎండీగా వరప్రసాద్

2 లో

# ఏపీ మేయర్ రిజర్వేషన్లు ఖరారు!

- 17 కార్పొరేషన్లకు కేటాయింపులు
- బీసీలకు ఐదు మేయర్ పీఠాలు
- ఎస్సీలకు రెండు స్థానాలు
- ఎస్టీలకు ఒక మేయర్ స్థానం
- జనరల్ మహిళలకు ఐదు పీఠాలు
- నాలుగు స్థానాలు అన్‌రిజర్వ్‌డ్
- ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల

2 లో

న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): రాష్ట్రంలో త్వరలో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ స్థానాల రిజర్వేషన్లను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వర్గాల వారీగా మేయర్ పీఠాల కేటాయింపును ఈ ప్రకటన ద్వారా స్పష్టం చేసింది. ఈ కేటాయింపుల ప్రకారం మొత్తం స్థానాల్లో బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1 మేయర్ స్థానాన్ని కేటాయించారు. అలాగే సాధారణ కేటగిరీలో జనరల్ మహిళలకు 5 స్థానాలు దక్కగా, మిగిలిన 4 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్ రొటేషన్ విధానంలో స్థానాలుగా నిర్ధారించారు.

కార్పొరేషన్ల వారీగా లెక్కలు ఇలా..

వివిధ కార్పొరేషన్ల కేటాయింపులను చూస్తూ మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ స్థానాన్ని ఎస్టీ కేటగిరీకి కేటాయించగా, రాజమండ్రి, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లను ఎస్సీ వర్గానికి కేటాయించారు. బీసీ కేటగిరీకి కేటాయించిన స్థానాల్లో మచిలీపట్నం, కాకినాడ కార్పొరేషన్లను బీసీ మహిళలకు ప్రత్యేకించగా.. అనంతపురం, ఏలూరు, చిత్తూరు మేయర్ స్థానాలను బీసీ జనరల్‌కు కేటాయించారు.

# కక్ష సాధింపునకు చిన్నారి బలి!

- ఉద్యోగం నుంచి తొలగించడంతో కక్ష
- రూ.20 లక్షల కోసం కిడ్నాప్
- బతుకమ్మ వేళ అదృశ్యమైన చిన్నారి
- సీసీటీవీతో బయటపడ్డ నిందితుడి కదలికలు
- వీడియో కాల్ అడగడంతో దారుణం
- సంప్‌లో చిన్నారి మృతదేహం
- పది ప్రత్యేక బృందాలతో పోలీసుల గాలింపు
- చివరకు పోలీసులకు చిక్కిన ప్రధాన నిందితుడు

2 లో

# లైంగిక వేధింపుల ఆరోపణలు.. కాంగ్రెస్ ఎంపీపై కేసు!

- కాంగ్రెస్ ఎంపీపై లైంగిక వేధింపుల కేసు నమోదు
- జేఎన్‌యూ ఫిర్యాదుతో రంగంలోకి ఢిల్లీ పోలీసులు
- 11 మంది విద్యార్థినుల నుంచి ఫిర్యాదులు
- నివాసానికి పిలిచి వేధించేందుకు యత్నించారని ఆరోపణలు
- ఆరోపణలపై అంతర్గత కమిటీ విచారణ
- ఆరోపణలు నిజమని తేలడంతో ఉద్యోగం నుంచి తొలగింపు
- కాంగ్రెస్‌పై, రాహుల్ గాంధీపై బీజేపీ నేతల తీవ్ర విమర్శలు


2 లో

న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, కాంగ్రెస్ ఎంపీ అంగోంచా బిమోల్ అకోయిజంపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. వర్సిటీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వసంత్ కుంజ్ నార్త్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్లు 75, 75(1)(i), 75(1)(iv), 79 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# తెలంగాణ ఏపీపీ ఫలితాలు విడుదల!

- ఫలితాలను ప్రకటించిన టీఎస్ఎల్‌పీఆర్‌బీ ఛైర్మన్
- అధికారిక వెబ్‌సైట్‌లో ఫైనల్ కీ అందుబాటులో
- యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో ఫలితాల పరిశీలన
- అర్హులైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ లెటర్లు
- అక్టోబర్ 17న సర్టిఫికెట్ల పరిశీలన
- గైర్హాజరైతే తదుపరి చర్యలు తప్పవన్న బోర్డు

2 లో

# జంతర్ మంతర్ ఇక నిరసనలకు నో!

- ఢిల్లీ పోలీసుల సంచలన నిర్ణయం
- ట్రాఫిక్ సమస్యలు, భద్రతా కారణాలతో కీలక చర్య
- స్థానికులకు అసౌకర్యం కలుగుతోందని అధికారుల వెల్లడి
- నిరసనలకు ప్రత్యామ్నాయంగా మూడు కొత్త వేదికలు
- రాంలీలా మైదానం, బురాడీ మైదానానికి అనుమతి
- ఈస్ట్ ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్స్‌లోనూ నిరసనలకు అవకాశంద
- జంతర్ మంతర్ వద్ద ధర్నాలు, నిరసనలపై నిషేధం

2 లో

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్
13-10-2026

# కక్ష సాధింపునకు చిన్నారి బలి!



న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): సికింద్రాబాద్ బొల్లారం పరిధిలోని కౌకూర్ ఆర్కిడ్ విల్లాస్‌లో జరిగిన ఐదేళ్ల చిన్నారి అరేలియా కిడ్నాప్, హత్య ఉదంతం అత్యంత విషాదకరంగా ముగిసింది. విల్లాలో అగ్రికల్చర్ సైంటిస్ట్ మిల్టన్ ఫెర్నాండెజ్ కుమార్తె అయిన అరేలియా, అక్టోబర్ 9న బతుకమ్మ వేడుకలు జరుగుతుండగా ఆడుకుంటూ అదృశ్యమైంది. చిన్నారి వెనుకే మాజీ సెక్యూరిటీ గార్డు విక్రమ్ వెళ్తున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యాయి. ప్రవర్తన సరిగా లేదనే కారణంతో విక్రమ్‌ను వారం క్రితం సొసైటీ యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించింది. ఆ కక్షతోనే అతడు పక్కా ప్లాన్ ప్రకారం చిన్నారిని కిడ్నాప్ చేశాడు. కిడ్నాప్ సమయంలో చిన్నారి అరుపులు బయటకు వినిపించకుండా విలాస్‌లో ఎలక్ట్రిషియన్‌ను పెద్ద సౌండ్ స్పీకర్ పెట్టమని కోరాడు.

చిన్నారిని విడిచిపెట్టాలంటే రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విక్రమ్ మరో సెక్యూరిటీ గార్డు వద్ద ఉన్న మొబైల్ ఫోన్ నుంచి పాప తండ్రికి, తాతకు వేర్వేరుగా ఫోన్ కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వీడియో కాల్‌లో చిన్నారిని చూపించాలని కోరడంతో, భయపడిపోయిన నిందితుడు పాపను బయటకు తీసుకెళ్లలేక, పోలీసులు వస్తారనే ఉద్దేశంతో దారుణానికి ఒడిగట్టాడు. చిన్నారి చేతులు, కాళ్లు కట్టేసి, నడుముకు రెండు ఇటుకలు కట్టి విల్లా ఆర్కిడ్ క్లబ్ హౌస్ సెల్లార్‌లోని వాటర్ సంప్‌లో పడేసి హత్య చేశాడు. చిన్నారి మృతదేహం సెల్లార్‌లో విగతజీవిగా లభించింది.

ఈ దారుణంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేసి పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా విక్రమ్‌కు సహకరించిన మరో సెక్యూరిటీ గార్డ్, ఎలక్ట్రిషియన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు విక్రమ్ కోసం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కూకట్‌పల్లి, పటాన్‌చెరు, బాల్‌నగర్ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో గాలింపు చర్యలు చేపట్టారు. రైల్వే స్టేషన్ చుట్టుపక్కల లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. చివరకు మల్కాజ్‌గిరి స్పెషల్ టీమ్ పోలీసులు సిటీ శివారులోని రైల్వే స్టేషన్ వద్ద నిందితుడు విక్రమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి కుటుంబ సభ్యులు నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# కామన్ పాస్ ధరలపై సర్కార్ పునరాలోచన!

**మొదటి పేజీ తరువాయి**

ఇందులో మెట్రో వాటా రూ.7,000, ఆర్టీసీ వాటా రూ.1,500గా నిర్ణయించారు.

అయితే ఈ ఛార్జీలు సామాన్య ప్రజలకు భారంగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు ఛార్జీలను పునః పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ధరలను నిర్ణయించే అంశంపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆర్టీసీ, మెట్రో సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకునేలా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రయాణికులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా, వారి అవసరాలకు అనుగుణంగా, సౌకర్యవంతమైన ధరలతో కామన్ పాస్ విధానం అమలయ్యేలా తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ – మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రజా రవాణాను మరింత అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ లక్ష్యం కాదని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

# 11 మంది ఐఏఎస్‌లకు కొత్త బాధ్యతలు!



న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులకు కొత్త పోస్టింగ్‌లు కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ నుంచి అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వం మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించగా, వారిలో 9 మందికి నూతన పోస్టింగ్‌లు, ఇద్దరికి పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. నూతన నియమకాల వివరాల ప్రకారం.. 2002 బ్యాచ్‌కు చెందిన సౌరభ్ గౌర్ న్యూఢిల్లీలోని ఏపీ భవన్ ఓఎస్‌డీగా నియమితులయ్యారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా డి. మురళీధర్ రెడ్డి, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శిగా మంజుల బాలాజీ దిగంబర్ పోస్టింగ్ పొందారు. ఇక పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా ఆమ్రపాలి కాటా, యువజన సేవల సంచాలకుడిగా కె. నీలకంఠ రెడ్డి నియమితులయ్యారు.

అలాగే పరిశ్రమలు, వాణిజ్య శాఖ సంయుక్త కార్యదర్శిగా బి. అనిల్ కుమార్ రెడ్డి (2017 బ్యాచ్), సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శిగా ఎన్. తేజ్ భరత్ (2018 బ్యాచ్) బాధ్యతలు చేపట్టనున్నారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ ఉప కార్యదర్శిగా గెడేల శ్రీను కుమార్, ఏపీ పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వర ప్రసాద్‌లను ప్రభుత్వం నియమించింది. మరోవైపు పూర్తి అదనపు బాధ్యతల విషయానికి వస్తే.. హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులుకు వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకుడిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా ఉన్న శుభమ్ బన్సల్ ఏపీ రాష్ట్ర ఆర్థిక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ ఉత్తర్వులన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం తెలిపింది.

# ఏపీకి మరో వాయుగుండం ముప్పు!



న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం మరోసారి మారుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నట్లు అధికారులు తెలిపారు.

ఇది క్రమంగా బలపడి రానున్న మూడు, నాలుగు రోజుల్లో ఉత్తర తమిళనాడు – దక్షిణ కోస్తాంధ్ర దిశగా పయనించే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ ప్రయాణంలో అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే సూచనలున్నాయని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే ఛాన్స్ ఉందని హెచ్చరించారు.

ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ , వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా సముద్రంలోకి వేటకు వెళ్లే మత్స్యకారులు మరింత జాగ్రత్తగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను పాటించాలని కోరారు. కోత దశలో ఉన్న పంటల విషయంలో రైతులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సూచించారు. వర్షాల తీవ్రత , గాలి దిశకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అధికారిక హెచ్చరికలను గమనించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# సావంత్ పాలనపై రేవంత్ సెటైర్లు!

**మొదటి పేజీ తరువాయి**

ఆయన గోవాను అభివృద్ధి చేసే పనిలో లేరని, కేవలం ఇక్కడి భూములు, ఆస్తులను ఇతరులకు కట్టబెట్టే పనుల్లో బిజీగా ఉన్నారని ఆరోపించారు. అందుకే గోవా ప్రజలు ఆయన్ను 'ప్రమోద్ సావంత్' అనడం మానేసి 'ప్రాపర్టీ సావంత్' అని పిలుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇక్కడి అరుదైన భూములు, పర్యావరణం, వారసత్వం శరవేగంగా అన్యాక్రాంతమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

డ్రగ్స్ రాజధానిగా గోవా.. 'నషా ముక్త్ భారత్' ఏమైంది?

బీజేపీ పాలనలో సుందరమైన గోవా కాస్తా డ్రగ్స్ కేంద్రంగా మారిపోయిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'నషా ముక్త్ భారత్' (డ్రగ్స్ రహిత భారత్) అంటూ గొప్పలు చెబుతోందని, మరి అదే నినాదాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలు ఎందుకు గోవాలో అమలు చేయడం లేదని నిలదీశారు. డ్రగ్స్ లార్డ్స్, ల్యాండ్ మాఫియాకు గోవా అడ్డాగా మారిందని, ఇది రాష్ట్ర కీర్తిని దిగజార్చుతోందని అన్నారు. గోవా యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దని, రాష్ట్రం పేరు చెడిపోవద్దన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు.

జ్ఞానేష్ కుమార్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్ర..

దేశంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీకి అనుకూలంగా వ్యవహరించే శక్తులు ఇప్పుడు బలహీనపడ్డాయని, అందుకే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ పేరును అడ్డుపెట్టుకుని పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓట్లను తొలగించే కుట్రకు తెరలేపారని సీఎం రేవంత్ ఆరోపించారు. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న పోరాటం 'రావణుడు' (బీజేపీ)కి, 'రాముడు' (కాంగ్రెస్)కి మధ్య జరుగుతున్న పోరాటమని అభివర్ణించారు. రావణుడి పాలనను అంతం చేయాలంటే ప్రజలంతా కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. గతంలో రెండుసార్లు మోసపోయిన గోవా ప్రజలు, మూడోసారి కూడా బీజేపీని నమ్మి మోసపోవద్దని హితవు పలికారు.

2027లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయం

దేశంలో రుతుపవనాలు (మాన్‌సూన్) ముందుగా కేరళలో ప్రవేశించి, ఆ తర్వాత గోవాకు వస్తాయని గుర్తుచేసిన రేవంత్ రెడ్డి.. అదే మాన్‌సూన్ సెంటిమెంట్‌ను గుర్తుచేశారు. ఇప్పటికే కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని, అలాగే 2027లో రాబోయే మాన్‌సూన్ నాటికి గోవాలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. గోవా గడ్డపై నుంచి ప్రారంభమయ్యే ఈ మార్పు దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటపై మువర్ణాల జెండాను ఎగరేసే వరకు నిలవదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం పార్టీ కోసం కాదని, కేవలం గోవా ప్రజల భవిష్యత్తు కోసమే అని ఆయన పునరుద్ఘాటించారు.

# జంతర్ మంతర్ ఇక నిరసనలకు నో!




న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): దేశ రాజధాని ఢిల్లీలో సుదీర్ఘకాలంగా ప్రధాన ధర్నా చౌక్‌గా సేవలు అందిస్తున్న జంతర్ మంతర్ వేదికపై ఢిల్లీ పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇకపై జంతర్ మంతర్ వద్ద ఎలాంటి ధర్నాలు, నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించడానికి వీలులేకుండా పోలీసులు నిషేధం విధించారు. ఈ మేరకు పోలీసు అధికారులు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాఫిక్ సమస్యలు, భద్రతా కారణాలు, స్థానికులకు కలుగుతున్న తీవ్ర అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. జంతర్ మంతర్ వద్ద ప్రతిరోజూ వివిధ సంఘాలు, రాజకీయ పార్టీలు చేపట్టే ఆందోళనల వల్ల ల్యూటియన్స్ ఢిల్లీ పరిధిలో వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు.

అయితే, ప్రజాస్వామ్యయుతంగా నిరసనలు తెలిపే హక్కును పరిరక్షిస్తూ, ధర్నాల కోసం ప్రత్యామ్నాయంగా 3 కొత్త ప్రదేశాలను ఢిల్లీ పోలీసులు కేటాయించారు. ఇకపై రాంలీలా మైదానం, బురాడీ మైదానం మరియు ఈస్ట్ ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్స్‌ను అధికారిక ధర్నా వేదికలుగా ప్రకటిస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ముందస్తు అనుమతితో ఈ మూడు వేదికల్లోనే నిరసనలు నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు.

# లైంగిక వేధింపుల ఆరోపణలు.. కాంగ్రెస్ ఎంపీపై కేసు!

**మొదటి పేజీ తరువాయి**

ఈ కేసుకు సంబంధించి లోతైన విచారణ జరుపుతున్నామని తెలిపారు.

గత మే నెలలో కనీసం 11 మంది విద్యార్థినులు బిమోల్ అకోయిజంపై లైంగిక వేధింపుల ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. సమావేశాలు, చర్చల సాకుతో విద్యార్థినులను క్యాంపస్‌లోని తన నివాసానికి పిలిపించి లైంగికంగా వేధించేందుకు యత్నించారని ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. అంతేకాకుండా తరగతి గదిలో కూడా ఆయన అసభ్యకర వ్యాఖ్యలు చేశారని కొందరు విద్యార్థులు ఆరోపించారు. ఈ ఫిర్యాదులపై జెఎన్‌యూ అంతర్గత కమిటీ సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలడంతో ఆయనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. ఈ వ్యవహారంపై భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌పై, ముఖ్యంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో బిజెపి ఎంపీ బన్సురి స్వరాజ్ మాట్లాడుతూ.. ఒక వైపు దేశంలో స్త్రీ శక్తిని ఆరాధిస్తుంటే, మరోవైపు కాంగ్రెస్ ఎంపీపై 11 మంది విద్యార్థినులు తీవ్ర లైంగిక ఆరోపణలు చేయడం దిగ్భ్రాంతికరమని అన్నారు. రాహుల్ గాంధీ చెప్పే 'స్మాష్ ది పాట్రియార్కీ' మాటలు కేవలం రాజకీయ నినాదాలకే పరిమితమా అని ప్రశ్నించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేతలు మౌనం వహించడం అంటే నిందితుడికి మద్దతు ఇవ్వడమేనని విమర్శించారు.

# తెలంగాణ ఏపీపీ ఫలితాలు విడుదల!




న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (TSLPRB) తెలంగాణ ప్రాసిక్యూషన్ సర్వీస్‌లోని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి సంబంధించి నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను బోర్డు ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు (ఐపీఎస్) విడుదల చేశారు. 2025 ఆగస్టు 15న వెలువడిన నోటిఫికేషన్ ఆధారంగా, 2025 డిసెంబర్ 14న హైదరాబాద్ పరిసరాల్లోని 4 కేంద్రాల్లో రాత పరీక్ష (పేపర్–1, పేపర్–2) నిర్వహించారు. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం బోర్డు ఫైనల్ కీని సిద్ధం చేసింది. రాత పరీక్ష ఫలితాలు, ఫైనల్ కీ, అలాగే పేపర్–1 ఓఎంఆర్ షీట్ల స్కాన్డ్ కాపీలను అధికారిక వెబ్‌సైట్ (www.tgprb.in)లో అందుబాటులోఉంచారు. అభ్యర్థులు తమ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లతో లాగిన్ అయి ఫలితాలను తనిఖీ చేసుకోవచ్చు.

ఇక అర్హత సాధించిన అభ్యర్థులు తమ సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఇంటిమేషన్ లెటర్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. లాగిన్ కావడం, ఇతర సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే, అభ్యర్థులు తమ రిజిస్టర్డ్ ఈమెయిల్ ఐడీ నుంచి support@tslprb.inకు ఈ–మెయిల్ చేయవచ్చు లేదా 040–41895151 నంబర్‌ను సంప్రదించవచ్చు.

అక్టోబర్ 17న సర్టిఫికెట్ల పరిశీలన..

రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 17న సర్టిఫికేట్ల పరిశీలన నిర్వహించనున్నారు. హాజరు కావాల్సిన సమయం, వేదిక వివరాలు ఇంటిమేషన్ లెటర్‌లో పేర్కొంటారు. అర్హత సాధించిన అభ్యర్థులు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంటుంది. నిర్దేశిత తేదీన హాజరుకాని పక్షంలో వారికి ఆసక్తి లేనట్లుగా భావించి తదుపరి చర్యలు తీసుకుంటామని బోర్డు తెలిపింది.

# ఏపీ మేయర్ రిజర్వేషన్లు ఖరారు!

**మొదటి పేజీ తరువాయి**

అదేవిధంగా విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, వైఎస్సార్ కడప, గ్రేటర్ విశాఖపట్నంస్థానాలను జనరల్ మహిళలకు కేటాయించారు. తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్లను అన్‌రిజర్వ్‌డ్ స్థానాలుగా ఖరారు చేస్తూ ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌లో పేర్కొంది.

విజయనగరం – జనరల్ మహిళ
శ్రీకాకుళం – జనరల్ మహిళ
గుంటూరు – జనరల్ మహిళ
కడప – జనరల్ మహిళ
విశాఖ – జనరల్ మహిళ
తిరుపతి – అన్‌రిజర్వ్‌డ్
విజయవాడ – అన్‌రిజర్వ్‌డ్
ఒంగోలు – అన్‌రిజర్వ్‌డ్
నెల్లూరు – అన్‌రిజర్వ్‌డ్
మంగళగిరి తాడేపల్లి – ఎస్టీ
రాజమహేంద్రవరం – ఎస్సీ
కర్నూలు – ఎస్సీ
మచిలీపట్నం – బీసీ మహిళ
కాకినాడ – బీసీ మహిళ
ఏలూరు – బీసీ జనరల్
అనంతపురం – బీసీ జనరల్
చిత్తూరు – బీసీ జనరల్

# ఆలయంలో బాలికపై లైంగికదాడికి యత్నం



న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): మహారాష్ట్రలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఆలయంలో మైనర్ బాలిక ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటన పింప్రి–చించ్వడ్‌లోని నిగ్డీ ప్రాంతంలో చోటు చేసుకుంది. శివాలయంలో దర్శనానికి వచ్చిన ఓ బాలిక మొదట దేవుడిని దర్శించుకుంది. అక్కడే దేవుడికి నమస్కారం చేసుకుంటున్న సమయంలో ఓ వ్యక్తి ఆలయంలోపలకు ప్రవేశించాడు. అనంతరం బాలికవద్దకు వెళ్లి లైంగికదాడికి యత్నించాడు. ఇంతలో ఏం జరిగిందో కానీ అక్కడి నుండి బయటకు వెళ్లిపోయాడు.

అనంతరం బాలిక బిక్కు బిక్కు మంటూ అక్కడే భయంతో ఉండిపోయింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీ టీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో స్థానికుల సమాచారంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మెట్రో సంస్థ ఉద్యోగి అని స్థానికులు చెబుతున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. స్థానికంగా ఈ ఘటన కలకలం రేపడంతో నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# కాంగ్రెస్‌లో కుంపటి.. టెండర్లలో మంట!

**మొదటి పేజీ తరువాయి**

తమ కంపెనీని పక్కన పెట్టి ఇతర రాష్ట్రాలకు చెందిన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు కోసం అధిక వడ్డీలకు ఇతర చోట్ల ప్రభుత్వం అప్పు చేసిందని తను పక్కన పెట్టేందుకు లేని నిబంధనలు పెట్టారని ఆరోపించారు. నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు అడిగితే ఇవ్వడం లేదని, కానీ అప్పులు తెచ్చిన డబ్బును ఇతర రాష్ట్రాల కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల సొమ్ము. మాకు ఈ పనుల్లో పది రూపాయలు మిగిలితే చాలు.. వంద రూపాయల లాభం అవసరం లేదు. తక్కువ ధరకు టెండర్లు వేస్తే వాటిని ఎందుకు తిరస్కరించాలి? అని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఫోన్లు వచ్చాయి

ఈ టెండర్లు వేయొద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కూడా తమకు ఫోన్లు వచ్చాయని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. అయినప్పటికీ తాము పోటీ టెండర్లు వేశామని చెప్పారు. టెండర్ల వ్యవహారంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, ఈ అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. తన కంపెనీని డిస్క్వాలిఫై చేయడానికి సంబంధిత అధికారులు ఎవరు? అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటామని, అవసరమైతే హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్తామని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలే ఇప్పుడు కూడా కనిపిస్తున్నాయని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. తక్కువ ధరకు పనులు చేసేందుకు ముందుకొచ్చిన కంపెనీలను పక్కన పెట్టి, ఎక్కువ ధరలకు ఇతర సంస్థలకు టెండర్లు కట్టబెట్టడం వల్ల ప్రజాధనానికి నష్టం జరుగుతుందని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరి మారకపోతే తెలంగాణ ప్రజల సొమ్ము దుర్వినియోగమవుతుందని అన్నారు.

సింగరేణి మూతపడే పరిస్థితి:

తెలంగాణలో ఈ మూడేళ్లలో పూర్తిగా అవినీతి పేరుకుపోయిందని సింగరేణి మూతపడే పడే పరిస్థితులు ఉన్నాయని రాజగోపాల్ రెడ్డి సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. దొరిగింది దొరికినట్లు దోచుకుంటుంటే మంచి పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నా మాలాంటి వారం ఈ దోపిడీపై కొట్లాడుతామన్నారు. ఈ విషయాన్ని తాను వదిలిపెట్టేది లేదని ఏది చేసుకుంటారో చేసుకోండి.. తాను మాత్రం ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఇవాళ కాంగ్రెస్ ముఖ్యనేతలు ఢిల్లీలో చేపట్టిన మార్చ్‌కు తాను దూరంగా ఉండటంపైనా రాజగోపాల్ రెడ్డి స్పందించారు. "ఈ విధంగా దోపిడీ జరుగుతుంటే ఎలా ఢిల్లీ ర్యాలీలో పాల్గొంటాం? రాజగోపాల్ రెడ్డి చేసినా, రేవంత్ రెడ్డి చేసినా తప్పు తప్పే. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖలోనే అవినీతి జరుగుతుంటే ఎలా చూస్తూ ఊరుకుంటాం? అని ప్రశ్నించారు.

# చరిత్ర సృష్టించిన శ్రీశైలం డ్యాం.. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు




న్యూస్ డెస్క్,12 అక్టోబర్ (బిఎన్ఎస్): తెలుగు రాష్ట్రాల జలప్రదాయిని, ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం లోని నీటిపారుదల ప్రాజెక్టు శ్రీశైలం డ్యాం ప్రపంచ స్థాయిలో అత్యంత అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. అంతర్జాతీయంగా ఎంతో ప్రాచుర్యం పొందిన లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో శ్రీశైలం డ్యాంకు చోటు లభించింది. ఈ గుర్తింపు దక్కించుకున్న భారతీయ ప్రాజెక్టులలో శ్రీశైలం డ్యాం నిలవడం విశేషం.

అరుదైన ఇంజనీరింగ్ అద్భుతం..

సముద్ర మట్టానికి దాదాపు 980 అడుగుల ఎత్తులో నిర్మితమైన శ్రీశైలం ప్రాజెక్టు డ్యామ్ ఎత్తు, దానికి అమర్చిన భారీ క్రెస్ట్ గేట్ల పరిమాణం, విశిష్టమైన నిర్మాణ శైలి, నాణ్యతా ప్రమాణాలు ఈ గుర్తింపు సాధించడంలో కీలక పాత్ర పోషించాయి. అలాగే, గతంలో రికార్డు స్థాయిలో భారీగా వచ్చిన వరద ప్రవాహాలను కూడా సమర్థవంతంగా తట్టుకుని నిలబడిన ఈ ప్రాజెక్టు భద్రతా విశేషాలను సేకరించిన సంస్థ బృందం దీనిని ప్రపంచ రికార్డుగా పరిగణించింది. ఈ విశిష్ట అవార్డు ప్రకటనలో భాగంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు అందజేసిన ప్రశంసాపత్రాన్ని శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీశైలం డ్యాం నిర్మాణ విశిష్టతకు, నాటి ఇంజనీర్ల నైపుణ్యానికి దక్కిన అంతర్జాతీయ గౌరవమిదని కొనియాడారు.

## మైదుకూరు జనసేన అసెంబ్లీ సమన్వయకర్తగా

# డాక్టర్. గోగు లక్ష్మీ భరత్ నియామకం..

**స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: డా. గోగు లక్ష్మీ భరత్..**

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 12: కడప జిల్లా.. మైదుకూరు జనసేన పార్టీ అసెంబ్లీ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డా. గోగు లక్ష్మీ భరత్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు పవన్ కళ్యాణ్ కు, పార్టీ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ బాధ్యతను ఒక పదవిగా కాకుండా, ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మైదుకూరు నియోజకవర్గ పరిధిలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని డా. గోగు లక్ష్మీ భరత్ తెలిపారు. పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడమే తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. పార్టీ నాయకత్వం నిర్దేశించిన మార్గంలో నిబద్ధతతో పనిచేస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పదవి అనేది హోదా కాదు.. ప్రజలకు సేవ చేసే బాధ్యత అంటూ స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలను సమన్వయం చేసుకుంటూ మైదుకూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను. నాపై నమ్మకం ఉంచిన రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మరోసారి హృదయపూర్వక ధన్యవాదాలు




తెలియజేస్తున్నాను. అని డా. గోగు లక్ష్మీ భరత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందించే సహకారంతో ప్రజాసేవలో ముందుకు సాగుతానని ఆయన తెలిపారు.

## విశ్వశాంతి సేవా సదన్ ఆధ్వర్యంలో స్టడీ హాల్ ప్రారంభించిన: కమలాపురం ఎమ్మెల్యే..




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 12: కడప జిల్లా... కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని ఆర్ఎస్ రోడ్డు నందు క్రియేటివ్ విజన్ అకాడమీ ద్వారా విశ్వశాంతి సేవా సదన్ ఆధ్వర్యంలో స్టడీహార్ మరియు డిజిటల్ లైబ్రరీని కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి చేతుల మీదుగా స్టడీ హాల్ ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను విశ్వశాంతి సేవా సదన్ సభ్యులు పూలమాల, శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చైతన్య రెడ్డి మాట్లాడుతూ... స్టడీ హాల్ ద్వారా ఎందరో నిరుద్యోగులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలిని, నిరుద్యోగులకు చదువు కొనుటకు అవసరమైన పుస్తకాలు తమ వంతుగా కొన్ని అందిస్తావని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఇదొక చక్కని స్టడీస్ సెంటర్ అని అన్నారు. కావున అందరూ దీనిని ఉపయోగించుకొని మంచి స్థాయిలోకి రావాలని ఆయన అన్నారు. అలాగే విశ్వశాంతి సేవా సదన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ ప్రముఖ రాజకీయ నాయకులు, అధికారులు, కార్యకర్తలు ప్రజలు తది,తరులు పాల్గొన్నారు.

# నాపై దుష్ప్రచారం ఆపాలి

- ఒక వివాదానికి రాజకీయరంగు పులమడం తగదు
- జరిగిన ఘటనపై వాస్తవాలు తెలుసుకోవాలి
- గొడవలు పెట్టుకోవడం నా స్వభావం కాదు
- టీడీపీ యువ నాయకుడు వాసిరెడ్డి బాబి




రాజమండ్రి(బిఎన్ఎస్)అక్టోబర్ 12: జరిగిన ఒక వివాదానికి రాజకీయ రంగు పులమడం తగదని, తననపై చేస్తున్న దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు,మాజీ డిప్యూటీ మేయరు వాసిరెడ్డి రాంబాబు కుమారుడు వాసిరెడ్డి బాబి కోరారు. సోమవారం రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై జరుగుతున్న ప్రచారం, ఇటీవల చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వాస్తవాలను వివరించారు. ఒక సంఘటనను రాజకీయ కోణంలో చూస్తూ తనపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.తాను ఎప్పుడూ గొడవలకు దూరంగా ఉంటానని, ప్రజలకు సహాయం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాల సమయంలో తన చెల్లెలు నివాసం ఉంటున్న ఫ్లాట్‌లో గొడవ జరుగుతోందని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లానని తెలిపారు. అక్కడ జరిగిన పరిణామాలను పూర్తిగా తెలుసుకోకుండా తనపై ఆరోపణలు చేయడం తగదన్నారు.వెంకట రామదాసు అనే వ్యక్తి మాజీమంత్రి చేగొండి హరిరామజోగయ్య కుమారుడని తనకు తెలియదన్నారు.కాని వెంకట రామదాసు తొలుత తనపట్ల దురుసుగా వ్యవహరించారని బాబి అన్నారు.సంబంధిత ఘటనలో నమోదైన కేసుల విషయంలో వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ రంగు పులమడం సరికాదని వాసిరెడ్డి బాబి పేర్కొన్నారు. తనపై రౌడీయిజం, ఇతర అంశాలకు సంబంధించి చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ఏ విషయాన్నైనా ఆధారాలతోనే మాట్లాడాలని సూచించారు. అలాగే భూకబ్జాలు,శాండ్ మాఫియాలో ప్రమేయం అంటూ తన పేరు చేర్చి రాయడం తగదని,తాను ఎప్పుడూ వాటిలో జోక్యం చేసుకోలేదని చెప్పారు.తన తండ్రి నేర్పిన విలువలతోనే తాను ముందుకు సాగుతున్నానని, వ్యక్తుల రాజకీయ నేపథ్యాన్ని కాకుండా వారి సమస్యలను, వయస్సును, గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవహరిస్తానని తెలిపారు. జరిగిన ఘటనపై వాస్తవాలు వెలుగులోకి రావాలని, తనపై నిరాధార నిందలు వేస్తూ అసత్య ప్రచారం చేయకుండా వాస్తవాల ఆధారంగా వార్తలు ప్రచురించాలని వాసిరెడ్డి బాబి కోరారు.

## అమలాపురంలో ఆర్టీసీ బస్సు ప్రమాదం.. తృటిలో తప్పిన పెను ప్రమాదం!

**బ్రేక్ ఫెయిల్‌తో చెట్టును ఢీకొన్న బస్సు**




అమలాపురం (బిఎన్ఎస్)అక్టోబర్ 12 : అమలాపురం నుంచి కాకినాడ వెళ్తున్న అమలాపురం డిపోకు చెందిన ఆర్టీసీ ఆర్డినరీ సర్వీస్ బస్సు ప్రమాదానికి గురైంది. ఎర్ర వంతెన వద్ద కిమ్స్ ఆసుపత్రికి వెళ్లే మార్గంలో బస్సు చెట్టును ఢీకొట్టింది.

బస్సుకు బ్రేక్ ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. అయితే ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.ప్రయాణికులు సురక్షితం.. తప్పిన పెను ప్రమాదం!

# కాకినాడ మేయర్ పీఠంపై కడలి ఈశ్వరి ఆశలు!

- ం బీసీ మహిళకు రిజర్వేషన్ ఖరారైతే ఈశ్వరికి కలిసొచ్చే అవకాశం?
- ం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సానుకూలంగా ఉన్నారంటూ రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ...

కాకినాడ (బిఎన్ఎస్)అక్టోబర్ 12 : కాకినాడ నగరపాలక సంస్థ మేయర్ పదవిపై జనసేన పార్టీలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. మేయర్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ అయ్యే అవకాశాల నేపథ్యంలో జనసేన మహిళా నేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ కడలి ఈశ్వరి పేరు మరోసారి తెరపైకి వచ్చింది. ఈసారి ఆమెకు మేయర్ పదవి దక్కే అవకాశాలున్నాయంటూ రాజకీయ వర్గాల్లో చర్చ జోరందుకుంది.

బీసీ మహిళా రిజర్వేషన్‌తో కొత్త సమీకరణాలు: కాకినాడ మేయర్ పదవికి బీసీ మహిళ రిజర్వేషన్ అమల్లోకి వస్తే, సామాజిక సమీకరణాలు కీలకంగా మారనున్నాయి. జిల్లాలో బలమైన సామాజిక వర్గంగా ఉన్న శెట్టిబలిజలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే అంశం కూడా చర్చకు వస్తోంది. ఈ నేపథ్యంలో శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన కడలి ఈశ్వరి అభ్యర్థిత్వంపై రాజకీయ వర్గాలు ఆసక్తి చూపుతున్నాయి. అయితే, రిజర్వేషన్‌పై తుది అధికారిక నిర్ధారణతో పాటు పార్టీ నిర్ణయం వెలువడాల్సి ఉంది.

పవన్ కళ్యాణ్ సానుకూలంగా ఉన్నారా?...: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈసారి కడలి ఈశ్వరికి అవకాశం కల్పించే విషయంలో సానుకూలంగా ఉన్నట్లు రాజకీయ నేతల వర్గాల్లో సమాచారం ప్రచారంలో ఉంది. అయితే, దీనిపై పార్టీ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈశ్వరి పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేయడంతో పాటు, ప్రస్తుతం రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్‌గా పార్టీ వ్యవహారాల్లోనూ చురుకుగా వ్యవహరిస్తున్నారు.

అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ: కాకినాడ మేయర్ పదవి విషయంలో రిజర్వేషన్, కూటమి రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం కీలకంగా మారనున్నాయి. బీసీ మహిళకు రిజర్వేషన్ ఖరారైతే కడలి ఈశ్వరి పేరు మరింత బలంగా వినిపించే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అయితే, ఆమె



అభ్యర్థిత్వంపై వస్తున్న చర్చలు ప్రస్తుతానికి ఊహాగానాలు, రాజకీయ వర్గాల సమాచారం వరకే పరిమితమయ్యాయి. తుది రిజర్వేషన్ జాబితా, జనసేన అధిష్ఠానం నిర్ణయం వెలువడిన తర్వాతే మేయర్ పీఠంపై స్పష్టత రానుంది...

## శరన్నవరాత్రుల ఏర్పాట్లను పరిశీలించిన హోమ్ మంత్రి వంగలపూడి అనిత



అమరావతి ,బిఎన్ఎస్ అక్టోబర్ 12:విజయవాడ నగరంలో ది.11.10.2026 నుండి ది.20.10.2026 వరకు వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రులు, విజయవాడ ఉత్సవ్ 2.0 మరియు పున్నమి ఘాట్‌లో బందోబస్తు ఏర్పాట్లను మరియు భక్తుల సౌకర్యార్థం మోడల్ గెస్ట్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను రాష్ట్ర హోమ్ శాఖామాత్యులు వి. అనిత పరిశీలించారు.ఈ నేపథ్యంలో డి.సి.పి.లు షిరిన్ బేగం, కె.జి.వి.సరిత, కృష్ణ ప్రసన్న ఐ.పి.ఎస్. తో పాటు ఇతర పోలీస్ అధికారులు హోమ్ మంత్రి గారికి కమాండ్ కంట్రోల్ పనితీరును క్షుణ్ణంగా వివరించారు.

కమాండ్ కంట్రోల్ నందు ఏర్పాటు చేసిన 30 అధునాతన డ్యాష్‌బోర్డుల ద్వారా ఏఐ, డ్రోన్లు & ఏఎన్‌పిఆర్ (ANPR): క్యూలైన్లలో భక్తుల కదలికలు, పార్కింగ్ స్థలాలు, ఆర్టీసీ మరియు రైల్వే ప్రయాణికుల రద్దీని ఏఐ కెమెరాలు, డ్రోన్లు, ANPR సిస్టమ్ మరియు డిజిటల్ ట్విన్స్ పరిజ్ఞానంతో క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

ఈ సారి ప్రత్యేకంగా భక్తుల సంఖ్యను మరియు రద్దీని ఎప్పటికప్పుడు గణిస్తూ నిరంతర పర్యవేక్షణకు 70కి పైగా అనలైటికల్ కెమెరాలను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం నగరంలో 40 పార్కింగ్ పాయింట్ల ఏర్పాటు మరియు ఎల్.ఈ.డి. స్క్రీన్లతో కూడిన 3 హోల్డింగ్ ఏరియాలను అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

అత్యంత పకడ్బందీగా, అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసు శాఖ చేపట్టిన ఈ వినూత్న ప్రణాళికలు మరియు బందోబస్తు ఏర్పాట్ల పట్ల హోమ్ మంత్రి వి. అనిత సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి..!

**కడప జిల్లా కలెక్టర్ డాక్టర్.. శ్రీధర్ చెరుకూరి వెల్లడి...**




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 12: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కడప జిల్లా కలెక్టర్ డాక్టర్. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధ చూపి, క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. అదే సమయంలో మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల కార్యక్రమాలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కడప కలెక్టరేట్ సభాభవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ డాక్టర్. శ్రీధర్ చెరుకూరి, జేసీ డాక్టర్ నిధీ మీనాతో కలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు అలసత్వం వీడి ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ చెరుకూరి సూచించారు. భూ సంబంధిత సమస్యలకు రెవెన్యూ క్లినిక్‌ల సేవలను వినియోగించు కోవాలని, ప్రజలకు తెలిపారు. అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. పొంతనలేని నివేదికలు సమర్పించవద్దని స్పష్టం చేశారు. మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలను ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చెరుకూరి ప్రజా పరిష్కార వేదిక నుండి అధికారులను ఆదేశించారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి పెద్ద పీట




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 12: ప్రజా ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో పరిష్కరించాలని కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్, జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్‌లో ఎస్పీ నచికేత్ నేరుగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై ఎస్పీ నచికేత్ కు మొత్తం 181 ఫిర్యాదులు అందజేశారు. ప్రతి ఫిర్యాదును స్వయంగా పరిశీలించిన ఎస్పీ.. సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ఫిర్యాదుల్లోని చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి.. నిర్ణీత గడువులోగా నిష్పక్షపాతంగా విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితుల సమస్యలను సానుభూతితో విని, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పరిష్కరించాలని, ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యత తో స్వీకరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ శాఖ దృష్టికి తీసుకురావాలని, చట్ట పరిధిలో పరిష్కరించగల ప్రతి ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె. ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. సుధాకర్, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, తది,తర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# నిత్యాన్నదానేశ్వరి గా దర్శనం

అమరావతి,బిఎన్ఎస్ అక్టోబర్ 12: ప్రతి జీవికి ఆహారం అవసరం. ఆహారాన్ని అందించేందుకే సాక్షాత్తు ఈశ్వరుడు పార్వతీదేవిని కోరడంతో, పార్వతీదేవి అన్నపూర్ణాదేవి అవతారంతో సృష్టిలోని జీవులకు అవసరమైన ఆహారాన్ని అందజేసినట్లుగా మనకి శివపురాణంలో చెప్పబడి ఉంది. పురాణంలోని ఇతిహాసం ప్రకారం శరన్నవరాత్ర ఉత్సవాలలో మూడో రోజు దుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆశ్వీజ శుద్ధ తదియ కావడంతో అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకారంగా అలంకరించి, అమ్మవారితో పాటుగా సాక్షాత్తు సృష్టి స్థితి లయకారుడైన ఈశ్వరుని కూడా అమ్మవారి చెంతన గర్భగుడిలో అలంకారం చేయటం ఈరోజు విశేషంగా చెప్పుకోవచ్చు. శివపార్వతులను చూసినంత ఫలితం ఈరోజు దర్శనం చేసుకుంటే వస్తుందని భక్తులు నమ్మకం. భక్తులు అన్నపూర్ణాదేవి ఎదుట బిక్ష కోసం నిలబడి ఉన్న ఈశ్వరుని చూసి ఈ మంత్రంతో పూజిస్తారు.

నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్యరత్నాకరీ నిర్ధూతాఖిలఘోరపావనకరీ ప్రత్యక్షమాహేశ్వరీ । ప్రాలేయాచలవంశపావనకరీ కాశీపురాధీశ్వరీ భిక్షాందేహి కృపావలంబనకరీ! మాతాన్నపూర్ణేశ్వరీ ॥ అంటూ మనసుతో పిలిస్తే పార్వతి దేవి అన్నపూర్ణాదేవిగా ప్రత్యక్షమై కరువు కాటకాలతో ఇబ్బందులు పడుతున్న భక్తులకు ప్రాణ శక్తిని అందజేసే ఆహారాన్ని అందజేసినట్లుగా మనకి చరిత్ర చెబుతోంది.. శ్రీఅన్నపూర్ణాదేవి అన్నమును ప్రసాదించే మాతృమూర్తి. అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నం సర్వజీవనాధారం, అన్నం లేనిదే జీవులకు



మనుగడలేదు.

శ్రీ అన్నపూర్ణాదేవి ఎడమచేతిలో ఉన్న బంగారు పాత్రలో ఉన్న అమృతాన్నము, కట్టెతో చేయబడిన గరిటెతో సాక్షాత్తుగా ఈశ్వరునికే భిక్షను అందించే ఘట్టము అద్భుతము, ఆమె దర్శనము సర్వపుణ్య ప్రదాయకము. లోకంలో జీవుల ఆకలిని తీర్చటంకన్నా మిన్న ఏదిలేదు. నిత్యాన్నదానేశ్వరి అలంకారంలో శ్రీదుర్గమ్మని దర్శించి తరించడంవలన అన్నాదులకు లోపం లేకుండా, ఇతరులకు అన్నదానం చేసే సౌభాగ్యాన్ని పొందగలుగుతారు. మాతా అన్నపూర్ణేశ్వరి అంటూ భక్తులు అంటూ దర్శించుకుంటే అన్న పానీయాలకు ఎటువంటి లోటు ఉండదని నమ్మకం.

# ప్రతి ఒక్కరు పరిశుధ్యానికి సహకరించండి

- వెంకటగిరి మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకు రూ.2.48 కోట్లతో తడి, పొడి చెత్త సేకరణ వాహనాలు ప్రారంభం: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ
- వెంకటగిరి అభివృద్ధికి రూ.192 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు
- పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి-ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి(బిఎన్ఎస్):-ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో రూ.2 కోట్ల 48 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన తడి, పొడి చెత్త సేకరణ వాహనాలను వెంకటగిరి ఎమ్మెల్యే శ్రీ కురుగొండ్ల రామకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం రూ.192 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశుధ్య సేవలను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి, తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా విభజించి నిర్వహించే విధంగా నూతన వాహనాలను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ వాహనాల ద్వారా చెత్త సేకరణ, నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగి పట్టణంలో పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు పారిశుధ్యం ఎంతో ముఖ్యమని, ఈ దిశగా మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అదేవిధంగా నిరుపయోగంగా ఉన్న పాత వాహనాలకు మరమ్మతులు చేయించాలి అని గతంలో సుమారు రూ.23 లక్షలతో కొనుగోలు చేసిన రోడ్లు శుభ్రం చేసే వాహనాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు.

ప్రజాధనంతో కొనుగోలు చేసిన వాహనాలను సక్రమంగా వినియోగించుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. వినియోగంలో లేని ఆ వాహనాలకు అవసరమైన మరమ్మతులు చేయించి తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిధులతో సమకూర్చిన వనరులు ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అదేవిధంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్య సేవలు మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఇంటి నుంచి క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరగాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పట్టణంలోని ప్రతి వార్డులో పారిశుధ్య పనులు సజావుగా సాగేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.అదేవిధంగా వెంకటగిరి సమగ్ర అభివృద్దే లక్ష్యంగా వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గారు పేర్కొన్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. అధికారులు, మున్సిపల్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మరోసారి సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షులు, పట్టణ సీనియర్ నాయకులు, పట్టణ కమిటీ నాయకులు, మహిళా పట్టణ అధ్యక్షురాలు, తెలుగుదేశం, జనసేన బీజేపీ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చించినాడ బ్రిడ్జిపై 24 గంటల పాటు రాకపోకలు పూర్తిగా నిలిపివేత

- అక్టోబర్ 15 ఉదయం 6 గంటల నుంచి 16 ఉదయం 6 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు
- భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలకూ అనుమతి లేదు
- ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి



అమలాపురం(బిఎన్ఎస్)అక్టోబర్ 12 : చించినాడ బ్రిడ్జిపై రోడ్డు బేరింగ్ మరమ్మతు పనుల నేపథ్యంలో అక్టోబర్ 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచి అక్టోబర్ 16వ తేదీ ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు అన్ని రకాల వాహనాల రాకపోకలను పూర్తిస్థాయిలో నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చించినాడ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు సురక్షితంగా కొనసాగేందుకు అవసరమైన రోడ్డు బేరింగ్ మరమ్మతు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ పనులను సజావుగా, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించేందుకు ఒకరోజు పాటు వంతెనపై ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయాల్సి వస్తోందని వివరించారు. మరమ్మతు పనులు జరుగుతున్న సమయంలో భారీ వాహనాలు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు సహా ఎలాంటి వాహనాలను వంతెనపైకి అనుమతించబోమని స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో చించినాడ బ్రిడ్జి మీదుగా ప్రయాణించే ప్రజలు, వాహనదారులు ముందుగానే తమ ప్రయాణాలను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని కోరారు.

ప్రజల భద్రత, వంతెనపై సురక్షిత రవాణా సౌకర్యాల మెరుగుదల కోసమే ఈ మరమ్మతు పనులు చేపడుతున్నామని, ప్రజలు అసౌకర్యాన్ని అర్థం చేసుకుని జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# విద్యావంతుల ఓటు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదు: డాక్టర్ తాటికొండ రాజయ్య

- ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్ మండల స్థాయి సమావేశం



**ధర్మసాగర్, అక్టోబర్ 12 (బిఎన్ఎస్ న్యూస్)**

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో విద్యావంతుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ధర్మసాగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హాజరై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో సాగునీరు, తాగునీరు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావంతుల ఓట్లు అడిగే నైతిక హక్కును కోల్పోయిందని వ్యాఖ్యానించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఫ్యాక్షనిస్టు పోకడలను ప్రతిబింబిస్తున్నాయని రాజయ్య విమర్శించారు.సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ దళితులకు ఎమ్మెల్సీ పదవులు కల్పించిన సందర్భాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని విద్యావంతులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, రాజకీయ పార్టీల పనితీరును పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కర్ర సోమిరెడ్డి, రాంగోపాల్ రెడ్డి, రాజన్ బాబు, గంటే బాలకుమార్, లక్క శ్రీనివాస్, కొలను రాజు, కంకటి కుమారస్వామి, ఎండీ షుకూర్, చేరాలు, మామిడి కుమార్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన (పి.డి) వై. శ్రీనివాసరావు




కొత్తపేట (బిఎన్ఎస్) అక్టోబర్: 12 : మాస్టర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు గుంటూరు నాగార్జున యూనివర్సిటీ లో ఈ నెల 10,11వ తేదీ లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో కోనసీమ జిల్లా నుండి కొత్తపేట మండలం, ఆవిడి గ్రామం చప్పిడివారిపాలెం హైస్కూల్ లో వ్యాయామ ఉపాధ్యాయులు (పి.డి) గా పనిచేస్తున్న వై.శ్రీనివాసరావు (వైఎస్ఆర్ ) పాల్గొని షాట్ పుట్ విభాగంలో ఫస్ట్ ప్లేస్, డిస్కస్ త్రో విభాగంలో సెకండ్ ప్లేస్, ప్లేస్, ట్రిపుల్ జంప్ విభాగంలో సెకండ్ ప్లేస్ సాధించి జనవరి 2027 ఉత్తరప్రదేశ్ లక్నో లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు ..ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు వై. శ్రీనివాసరావును ను అభినందించారు.

# పులివెందుల మున్సిపల్ పోరులో.. కాంగ్రెస్ పార్టీ పోటీలో ఉంటుందా...!!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా అక్టోబర్ 12: పులివెందుల మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాల పై చర్చ జోరందుకుంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తరపున బరిలోకి దిగబోయే అభ్యర్థి ఎవరనే అంశం స్థానిక రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మాజీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు రెడ్డి సతీమణి అనసూయ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తే ఎలా ఉంటుందనే చర్చ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వర్గాల్లో సాగుతున్నట్లు తెలుస్తోంది. ఆమె అభ్యర్థిత్వం ఖరారైతే తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు గట్టి పోటీ ఇవ్వగలరని కొందరు అభిప్రాయ పడుతున్నట్లు సమాచారం. పులివెందులలో టీడీపీ, వైసీపీ మధ్య రాజకీయ పోరు ఎలా ఉండబోతోందనే ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక కూడా ప్రాధాన్యత సంచరించు కుంటుందని చెప్పాలి. అనసూయ పేరుపై జరుగుతున్న చర్చకు పార్టీ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది.? ఆమె ఎన్నికల బరిలోకి దిగుతారా.? అన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. అయితే అనసూయ అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన వెలువడిందా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. మొత్తానికి పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎవరిని బరిలోకి దింపుతుంది.? ఆ అభ్యర్థి టీడీపీ, వైసీపీలకు ఎంతవరకు పోటీ ఇవ్వగలరు.? అన్న అంశాలు పులివెందుల స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# దసరా పండుగ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి బట్టల పంపిణీ

- సర్పంచ్ అన్నం స్వప్న- గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ బ్రహ్మ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం

**బిఎన్ఎస్ న్యూస్ జఫర్గఢ్ అక్టోబర్ 12**



దసరా పండుగను పురస్కరించుకొని జనగామ జిల్లా జఫర్గఢ్ మండలం తమ్మడపల్లి(జి) గ్రామంలో గ్రామ సర్పంచ్ అన్నం స్వప్న -గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నం బ్రహ్మ రెడ్డి ఆధ్వర్యంలో బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ పాలనలో భాగస్వాములుగా ఉంటూ గ్రామ అభివృద్ధికి తమ వంతు సేవలందిస్తున్న సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కమిటీ సభ్యులను గౌరవిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది 7 మంది, వార్డు మెంబర్లు 10 మంది, పంచాయతీ కమిటీ సభ్యులు 9 మందితో పాటు ఇతరులకు కలిపి మొత్తం 35 మందికి బట్టలు పంపిణీ చేశారు. దసరా పండుగ వేళ బట్టలు అందించడం ద్వారా వారిలో పండుగ సంతోషాన్ని నింపారు.గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు మెంబర్లు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేయడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.పండుగలు పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడంతో పాటు అందరినీ ఐక్యంగా ఉంచుతాయని, గ్రామంలో సోదరభావం, ఐక్యతను మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు.దసరా పండుగ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులకు బట్టలు పంపిణీ చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# తప్పిపోయిన ఇద్దరు పిల్లలను గుర్తించి ఆశ్రమానికి అప్పగించిన ఘన్‌పూర్ పోలీసులు

డయల్ 112 కానిస్టేబుల్ సతీష్ అప్రమత్తతతో పిల్లల ఆచూకీ గుర్తింపు



**బిఎన్ఎస్ న్యూస్ ఘన్‌పూర్, అక్టోబర్ 12**

జాఫర్‌గఢ్‌లోని మా ఇల్లు ఆశ్రమం నుంచి తప్పిపోయిన ఇద్దరు పిల్లలను ఘన్‌పూర్‌లో గుర్తించిన పోలీసులు, వారిని తిరిగి ఆశ్రమానికి తీసుకువచ్చి సురక్షితంగా నిర్వాహకులకు అప్పగించారు.లింగాల ఘనపురం ప్రాంతానికి చెందిన ధనుంజయ్, యశ్వంత్ అనే ఇద్దరు పిల్లలు ఆశ్రమం నుంచి తప్పిపోవడంతో వారి ఆచూకీ గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఘన్‌పూర్‌లో విధులు నిర్వహిస్తున్న డయల్ 112 కానిస్టేబుల్ సతీష్ పిల్లలను గుర్తించి, జాగ్రత్తగా తిరిగి ఆశ్రమానికి చేర్చారు.పిల్లలను సురక్షితంగా ఆశ్రమానికి అప్పగించడంతో ఆశ్రమ నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు.సమయస్ఫూర్తితో వ్యవహరించి పిల్లలను క్షేమంగా అప్పగించిన కానిస్టేబుల్ సతీష్ చర్యను పలువురు అభినందిస్తున్నారు.